# వింత ప్రపంచం

**లం**డన్ మహానగరం ఏ నది ఒడ్డున వుందో నేను చెప్పగలను. ఆకులు రాలని అడవులంటే ఏమిటో వివరించగలను. మధ్యధరా సముద్ర ప్రాంతం దేనికి ప్రసిద్ధో పేర్కొనగలను. కానీ నెమళ్ళ దిన్నెను గురించి నాకు తెలిసింది చాలా తక్కువ. అదొక ఊరని తెలుసు. మా జిల్లాలోనే వుందనీ తెలుసు. అంతకుమించి దాని ఉనికి, స్వరూపం, ప్రత్యేకత యివేవీ తెలియదు. స్వాతంత్ర్యం వచ్చాక మంచికో చెడుకో పల్లెకొక చిన్న బడి, పేటకొక హైస్కూలు వచ్చేశాయి గదా! ఆ పంపిణీలో నెమళ్ళదిన్నెకు గూడా ఒక హైస్కూలు వచ్చినట్టుంది. నాకెలా తెలిసిందంటే - ఈ మధ్య ఒకనాడు చిత్తూరు బస్‌స్టాండు జనసమ్మర్ధంలో కాస్త ముఖ పరిచయం వున్న ఒక పెద్దమనిషి నన్నెట్లాగో ఒడిసిపట్టేశాడు. "ఏమయ్యా రఘుపతీ! నన్ను మరచిపోయావా? నేనయ్యా వెంకటాచలాన్ని! జిల్లా పరిషత్తు కొలువులో చాలా చాలా చోట్ల, చాలా చాలా హోదాల్లో పనిచేసినవాణ్ణి. ప్రస్తుతం నెమళ్ళదిన్నెలో హెడ్మాస్టరుగా వున్నా! ఏం నాయనా, ఒకసారి మా వూరికి రారాదా? ఏంలేదులే. మా పిల్లలకు నాలుగు మంచి మాటలు చెప్పడంకోసం. ఆ పని మీరే చెయ్యొచ్చుగదా అంటావేమో! చెయ్యొచ్చు గానీ, ఒక రచయిత ద్వారా చెప్పిస్తే దాని దారే వేరు. ఏం బాబూ! వస్తావు గదూ? ఫిబ్రవరి అయిదు అనుకుందాం. నీకు వీలేనా?" అంటూ నా ముందరి కాళ్ళకు బంధాలు చుట్టేయసాగాడు.

"ఫిబ్రవరి అయిదా! ఇంకా ఓ నెలా రోజులుందిగదా! అప్పుడే ఏం చెప్పగలను?" అంటూ, దేశంపైన సవాలక్ష ప్రోగ్రాములున్నట్టు నేను గంభీరమైన పోజు పెట్టేశాను.

"పోనీ, ఆ తేదీని మాకు కేటాయించు."

ఇంతలో మా ఊరు బస్సొచ్చేసింది. జనసమూహంగుండా నేను చొచ్చుకుపోతుండగా వెనుక వైపునుంచి హెచ్చరిక వినిపించింది- "బాబూ, రఘుపతీ! ఫిబ్రవరి అయిదు. మరచిపోవుగదూ?...."

బస్సులో కూచ్చున్నాక నాలో నేనే నవ్వుకున్నాను - డియర్ మిస్టర్ వెంకటాచలం గారూ! మీ నెమళ్ళదిన్నెను మీరు ఏ బొంబాయిగానో, బెంగుళూరు గానో భావిస్తే ఎలా? జిల్లా పటంలోనైనా దాని పేరు కనిపించడం అనుమానమే గదా! దానికి విమాన మార్గం వుందా? సముద్రయానం ద్వారా రావచ్చునా? ఏ ఎక్స్‌ప్రెస్ నన్నక్కడకు చేరుస్తుంది? ఈ వివరాలేవీ చెప్పకుండా వచ్చేయమంటే నేనెలా వస్తాను? ప్రవరుడికి దొరికిన పాదలేపనంలాంటిదేదీ నా దగ్గర లేదే!

తెలివి తేటలన్నీ తన సొత్తేననుకోడం మానవుడాదినుంచి చేస్తున్న పొరబాటు. నాకు సంబంధించినంతవరకు ఈ నిజాన్ని వెంకటాచలంగారు తన చేతలతోనే నిరూపించగలిగారు. ఎలాగంటారా? ఫిబ్రవరి అయిదున ఉదయం తొమ్మిది గంటలప్పుడు నేను పోస్టాఫీసుకు వెళ్లొద్దామని బయల్దేరి, వసారాలో అడుగుపెట్టేసరికి కుర్చీ కిరకిరలాడుతున్నట్లు తోచి వెనుదిరిగి చూచాను. బొద్దు మీసాలతో, చలువ కళ్ళద్దాలతో, ఉంగరాలు వుంగరాలుగా పైకి లేచిన జుత్తుతో కుర్చీలో యిరుక్కుపోయిన

ఓ భారీ మనిషి పైకి లేవడానికి ప్రయత్నిస్తూ "నమస్కారమండీ! మిమ్మల్ని తీసుకరమ్మని మా హెడ్మాస్టరుగారు పంపించారు. నేను పి.ఇ.టి.ని. నా పేరు అంజనేయులు" అన్నాడు.

నిజానికప్పటికీ నెమళ్ళదిన్నె ప్రోగ్రాము నాకు సుతరామూ జ్ఞప్తిలో లేదు. కానీ ఆంజనేయుల్ని ప్రయోగించడం ద్వారా వెంకటాచలంగారు నాకు వాకట్టు వేసేశారు. ఎక్కువగా మాట్లాడితే ఇతడు నన్ను అంగుష్ఠమాత్ర శరీరుణ్ణిగా చేసి జేబులో వేసుకుని వెళ్ళిపోయేటట్టున్నాడు. 'లేదు, కాదు' అని అన్న వ్యతిరేక వచనాలు నా నోటినుంచి వెలువడడానికి మొరాయించాయి.

"హెడ్మాస్టరుగారు పంపించారా? మిమ్మల్ని! బయల్దేరదామంటారా? టైముందా?" అంటూ నీళ్ళు నమిలాను.

ఆంజనేయులు నన్ను ట్రంకురోడ్డు పైకి తీసుకెళ్ళి నీలాద్రిపురం బస్సెక్కించాడు. పన్నెండు గంటల ప్రాంతంలో చామంతిపాళ్యం గ్రామంలో దించేశాడు. ఓ అరగంటసేపు వేచివున్న తర్వాత అక్కడికి ఇచ్చిన పాతకోట టు గంగాసాగరం వయా చామంతిపాళ్యం బస్సులోకి ఎగిరి దూకి మాకు కావలసినమేరకు జాగా ఆక్రమించేశాడు. నిక్కుతూ నీలుగుతూ నేను నింపాదిగా వెళ్ళేటప్పటికి "రండి మేష్టారూ! కూచోండి" అంటూ నా సీటు నాకు చూపించాడు.

బస్సు కదిలింది. వేగం పుంజుకుంది. గ్రామీణ ప్రాంతాలగుండా సాగిపోతోంది. క్రాసులో ఎక్కిన ప్రయాణికులకు కండక్టరు టికెట్టు కొట్టడం పూర్తిచేశాడు. బస్సు తుప్పలగుండా, పొదలగుండా కనుచూపు మేరలో బారులుతీర్చివున్న కొండల వైపు పరుగిడుతోంది.

ఉండి వుండీ నాకెందుకో ఆంజనేయుల్ని కొంచెం ఆట పట్టించాలనిపించింది. "ఏమండీ ఆంజనేయులుగారూ! గంగాసాగరమంటే ఊరా, చెరువా?" అని ప్రశ్నించాను.

"చెరువేగానీండీ, ఆ పేరుతో కట్ట క్రింద ఓ వూరుగూడా వుంది. ఈ రోడ్డువస్తోంది చూచారా, ఈ వైపు మాత్రమే ప్రపంచంతో లంకె. మిగిలిన మూడు వైపులా వలయాకారంగా కొండలు. కొండలకడ్డంగా కట్ట వేసేశారు. అదే గంగా సాగరం! సార్థకమైన పేరే. కొండల్లో వానపడితే, దొర్లిన ప్రతి వానచినుకూ, చెరువులోకే వస్తుంది. చెరువులో నీళ్లుంటే బావుల్లో నీటిమట్టం తగ్గదు. వాగుల్లో చెమ్మదనం యింకిపోదు. అయిదారు మైళ్ళ చుట్టు కైవారంలోని ముప్ఫై నలభైపల్లెలకు ఈ చెరువే ఆధారం. 'గంగాసంద్రం నిండిందంటే కపిల బావులే కోనేర్లు, గంగాసంద్రం నిండిందంటే కరువేలేదు ఏడేండ్లు' - ఈ పాట మీరు వినలేదా?"

విన్నానా, వింటున్నానా? ఆలోచన సాగడంలేదు. నా ధ్యాసంతా కిటికీల గుండా కనిపిస్తున్న దృశ్యాలపైన్నే లగ్నమైపోయింది. రెండు కొండల నడుమ పొడుగాటి లోయ. అది మొదట మొదట ఒక కిలోమీటరుకు మించి వ్యాపించినట్టు లేదు. లోయ నడుమ కొండలతో పోటికి దిగినట్టు ఏపుగా పెరిగిన కొబ్బరి తోపులు. ఆ తోపుల మధ్య ఉత్తరపు దిక్కుగా ప్రవహిస్తున్న ఏరు - దాగుడు మూతలాడినట్టుగా అక్కడక్కడా దృగ్గోచరమవుతోంది. పడమటి కొండ పాదపీఠం వెంబడి వెళ్తున్న రోడ్డుకు రెండోవైపున మామిడి, నిమ్మ, జామలాంటి ఫలవృక్షాల తోటలు వ్యాపించాయి. ఆ కొబ్బరి తోటలకు

ఈ పండ్ల తోటలకు నడుమనున్న ఆవరణ అరటి, చెరకు, వరి లాంటి పైరు పచ్చలతో నీటిలో తడిసి ఎగుడు దిగుడు ప్రదేశంలో ఆరవేసిన పచ్చటి తివాచీలా వుంది. ప్రత్యంగుళమూ పచ్చగా కనిపిస్తున్న ఆ మహాదృశ్యంలో కొట్టొచ్చినట్టుగా కనిపిస్తున్న విలక్షణ మేమిటంటే – ప్రతి చెట్టూ తన అవధుల్ని మీరి పెరిగివుండడం. గానుగచెట్టు పెద్ద వేపచెట్టు స్థాయికి ఎదిగింది. వేపచెట్టు బలిసిన మద్దిచెట్టు ప్రమాణంలో వుంది. మద్దిమాను వటవృక్షంలా విస్తరించింది.

"మీ వైపు వృక్ష సంపదను చూస్తుంటే చాలా ఆశ్చర్యంగా వుందండీ ఆంజనేయులుగారూ! బహుశా యిది బాగా కండగలిగిన నేల అనుకుంటాను" అంటూ ఒక సాభిప్రాయ ప్రకటన గావించాను.

"కారణం అదొక్కటే గాదు. ఇక్కడ పచ్చికొమ్మ పైన కత్తిమోపడం పచ్చిప్రాణం తీయడంతో సమానంగా భావిస్తారు. అదీ అసలు విషయం."

నేను తెల్లబోయి ఆంజనేయులు ముఖంలోకి చూస్తూ వుండిపోయాను. బొగ్గులకోసం కల్పతరువునైనా తెగ నరకడానికి వెనుదీయని ప్రపంచానికి చెందినవాణ్ణి గదా – నాకతడి మాటలు నమ్మశక్యం గావడంలేదు. అయినా నా ఆసక్తి కొద్దీ యింకొక సందేహాన్ని బయట పెట్టడం తప్పనిసరైపోయింది.

"చూడండి ఆంజనేయులుగారూ! బ్యాంకుల్లోవున్న డబ్బుకు గూడా భద్రత లోపిస్తున్న కాలం యిది. కన్నులా వుండగానే కంటిపాపను కత్తిరించుకు పోతున్నారు. మరైతే పండ్లకాపు క్రిక్కిరిసివున్న ఈ తోపుల్ని ఎలా కాపుదారీ చేయగలుగుతున్నారండీ మీ రైతులు? అందుకోసమని ఒక పటాలాన్ని కేటాయించినా సాధ్యం కాదే!" అంటూ విస్మయం వెలిబుచ్చారు.

"నిజమే. అలాంటి అవసరం లేదు గాబట్టి బ్రతికిపోయారు. పండ్లకాపు మాత్రమే గాదు, చెరకు గానుగలు, పంపుసెట్లు, ఇంకా ఎన్నెన్నో వ్యవసాయ పరికారాలు ఎక్కడ వేసినవక్కడ పడి వుంటాయి. అడివి మెకాలొచ్చి తినిపోతాయని గాకపోతే పంట కళ్ళాల దగ్గరగూడా ఎవరూ పడుకోరు...."

వాస్తవమా? కాకపోతే స్వస్థానంపట్లగల అభిమానమా? ఏ నిర్ణయానికి రావాలో నాకు పాలుపోవడంలేదు.

"నెమళ్ళదిన్నె! దిగండయ్యా! దిగండమ్మా!" డ్రయివరు కేకతో తేరుకున్నాను.

దిగాను. ఆంజనేయుల్ని వెంబడిస్తుండగా నా నడకకెక్కడో బ్రేకు పడిపోయింది. టిబెట్టును ప్రపంచపు పై కప్పని ఎందుకంటారో నాకు తెలిసొచ్చిందప్పుడే! లోయకంటా ఆ వూరే పై కప్పులా వుంది. వినీలాకాశం, పచ్చటి కొండకోనలు, వాగులు వంకలు, తోటలూ పైర్లూ, మిట్టలూ పల్లాలూ మొత్తం నైసర్గిక రూపమంతా అక్కడికి పెద్ద నీటిరంగుల చిత్తరువులా కనిపిస్తోంది.

"నిలిచిపోయారేమిటి? రండి. హెడ్మాస్టరుగారు వేచి వుంటారు" అంటున్నాడు ఆంజనేయులు.

హెడ్మాస్టరుగారి ఆతిథ్యంలో వంకలెన్నదగిన అంశాలేవీ లేవు. భోజనానంతరం ఓ అరగంటసేపు పిచ్చాపాటితో గడిచిపోయింది. మాటల సందర్భంలో ఆ వూరి ప్రస్తావన వచ్చేసరికి ఆయన ఉత్తేజితుడైపోయాడు. "ఈ పాయకట్టు కంతా పెద్దవూరు

ఇదేనయ్యా రఘుపతీ! మేజరు పంచాయతీ అన్నమాట! ఇంకా నువ్వొకసారి తిరిగి చూడలేదేమో! ఊరికి వుండవలసిన హంగులన్నీ దీనికున్నాయి. ఆదర్శగ్రామంగా జిల్లా స్థాయిలో రెండు మూడుసార్లు ప్రయిజులొచ్చాయి గూడా!"

ఇలాంటి ప్రశస్తి ఏదో వుండొచ్చునని నేను ఊరిని చూడగానే అనుకున్నాను.

స్కూలుకు బయల్దేరబోతూ వెంకటాచలంగారు ఆనాటి కార్యక్రమమేమిటో సెలవిచ్చారు. ఎస్సెస్సీ విద్యార్థులకు వీడ్కోలిస్తున్నారట! ఆ ఏర్పాట్లేవో చూడ్డంకోసం ఆయన వెళ్ళిపోయిన తర్వాత, సమావేశంలో నేను పిల్లల్ని ఉద్దేశించి చెప్పవలసిందేమిటన్నది ఆలోచనీయాంశమైపోయింది. నైతికంగా అధికారం లేనివాళ్ళు చెప్పిన నీతులు వెయిట్ మోపని కాగితంలా గాలి కెగిరిపోతాయి. వినదగిన అర్హతలేని వాళ్ళకు చెప్పిన మంచి మాటలు బండపైన విత్తనాల్లా నిష్ఫలమైపోతాయి. నీతి బోధ చేయడానికి నాకేమాత్రం అధికారం వుందో నాకు తెలియదు. ఆ పనికి పూనుకుని కొన్ని కొన్ని విద్యాసంస్థల్లో నేను ఘోరమైన పరాజయానికి లోనయ్యాను. ఒకచోట పదహారు, పరిహేడేళ్ళ వయస్సున్న భావిభారత పౌరులు ఈలలతో పిల్లికూతలతో నా నోటికి తాళం వేసేశారు. వేదిక నలంకరించిన పెద్దలం క్రిందికి దిగడమే తరువాయిగా 'రావె రావే రాచుక్కా, రంగూజేద్దాము రావే, పోరా పోరా బేకూబా, పొర్లింపు మాటలేలా' లాంటి పాటలకు అనుగుణ్యంగా రికార్డు డ్యాన్సులు ప్రారంభించేశారు. మరొకచోట నా ప్రసంగానికి గొప్ప రెస్పాన్సు వచ్చేస్తున్నట్టు నేను మురిసిపోతున్న తరుణంలో 'సుత్తి' అంటూ అరిచి గీపెట్టారు. మరొకచోట టపాకాయలు కాల్చారు. మొత్తంపైన భారతీయ విద్యావ్యవస్థలో కొత్తయుగం ప్రారంభమైపోయిందనీ, పిల్లకాయలెంత విశృంఖల వికటతాండవానికైతే పూనుకుంటారో, అయ్యవార్లంతగా కృంగి కుంచించుకపోవడం ఈ యుగ ధర్మమనీ నా కవగతమైపోయింది. అయినా మొగమాటంకొద్దీ అప్పుడప్పుడు యిలా రోటిలో తలపెట్టక తప్పడం లేదు.

ఉన్నత పాఠశాల ఊరికి కొంచెం దూరంగా, ఒక ఎత్తయిన ప్రదేశంలో నిర్మితమైంది. జైలులా దానికి ప్రహరీ గోడలు లేవు. విశాలమైన ఆవరణ చుట్టూ ముళ్ళతీగలతోనే కంచె వేసేశారు. లోపల పూలచెట్లకు, నీడనిచ్చే చెట్లకు కొదువే లేదు. రెండు రావిచెట్లమధ్య సభాస్థలి ఏర్పాటయింది. ఎట్టయెదుట తూర్పువైపున వేదిక. ఆహుతులనందరినీ ఆహ్వానించి వేదిక ముందు కుర్చీల్లో కూచోబెడుతున్న హెడ్మాస్టరుగారు సభా కార్యక్రమానికి ముందుగా ఒక పెద్దాయనను నాకు పరిచయం చేశాడు.

"నాయనా రఘుపతీ! మా వూరి సర్పంచ్ మల్లేశప్పగారు; ఈనాటి సభాధ్యక్షులు వీరే!"

పంచపైన పొడుగుచేతుల చొక్కా తొడుక్కుని, నలిగిపోయిన కండువాను మెడకు చుట్టుకున్న ఆ కాయపాటు ముసలాయన "నమస్కారమండీ రఘుపతి గారూ! మీ పేరు నాకు పరిచయమే. పత్రికల్లో అప్పుడప్పుడూ చూస్తుంటాను" అన్నాడు.

అనుమాన దృక్కులతో ఆయన ముఖాన్ని గాలించకుండా వుండలేక పోయాను. ఆరుగాలాలు గనుమగట్లు పైన తిరుగుతూ, మడి దున్నుకుని బ్రతికే అసలు సిసలు రైతులా వున్న ఈయన పత్రికల ముఖమైనా చూచి వుంటాడా అని నా అనుమానం!

“మీలాంటి వాళ్ళు మా వూరికి రావడం చాలా అరుదు. చాలా విషయాలు మాట్లాడాలి మీతో! రేపొకసారి మా యింటికి దయచేయండి.” ఆహ్వానించాడాయన.

అలంకారప్రాయంగా కొమ్మలకు తగిలించిన సీరియల్ బల్బులు వెదజల్లుతున్న రంగురంగుల వెలుగుల్లో, సువిశాల ప్రకృతి సీమపైకి వంగిన వినీలాకాశమే నేపథ్యంగావున్న వేదికపైన, వెలుగుచీకట్లు గుసగుసలాడుకుంటున్న మునిమాపువేళ సభ ప్రారంభమైంది. కార్యక్రమం జరిగిన రెండు గంటల వ్యవధిలో ఎదురైన అనుకోని అనుభవాలు, ఊహించని వాస్తవాలు నన్ను దిగ్భ్రాంతిలో ముంచేశాయి. మొదటిది సభాధ్యక్షుడి ప్రసంగం “చల్లని వేలుపు చదువుల తల్లికి నమస్కారం. మా బిడ్డలకు జ్ఞానభిక్ష పెట్టే గురువర్యులకు నమస్కారం! సదసద్వివేకంకోసం విద్యసభ్యసించే బాలబాలికలకు ఆశీర్వాదం!” అంటూ ప్రారంభమైన ఆయన ఉపన్యాసం అరగంటసేపు నిరాఘాటంగా కొనసాగింది. మోగాటి బంటి లోతేననుకుని దిగేసరికి, పది నిలువుల లోతుకు వెళ్ళిపోయి, ఊపిరాడక ఉక్కిరిబిక్కిరైనట్టుంది నా పరిస్థితి.

తమను ప్రాణాధికంగా చేసుకునే తల్లిదండ్రుల పట్ల, తమ అభ్యున్నతి కోసం శ్రద్ధ తీసుకునే ఉపాధ్యాయుల పట్ల విద్యార్థులకు గల బాధ్యతల్ని గురించి సూక్తులతో రంగరిస్తూ, దృష్టాంతాలతో విశదీకరిస్తూ, ఆశువుగా అలవోకగా తేటతెల్లంగా ఆయన మాట్లాడుతుంటే ‘గుడిమేళం కాదురా బాబూ, ఇది నగరిమేళం’ అని నేను గ్రహించగలిగాను. ఆయన ప్రసంగించి కూచోగానే, నేను లేచి నిలబడి మాట్లాడవలసి వచ్చినప్పుడు నా కాళ్ళు కంపిస్తున్నట్టు, కంఠం కొద్దిగా బొంగురుపోతున్నట్లు, మాటల్లో తడబాటు కనిపిస్తున్నట్టు నాలో నాకే అనిపించింది. ఎట్లాగో ధైర్యాన్ని కూడదీసుకుని నా పాత్ర నిర్వహణ అయిందనిపించాను.

ఆ సన్నివేశంలో నాకు మరింత అపురూపంగా తోచిన మరొక విషయం అక్కడి గురుశిష్య సంబంధం. శకుంతలను అత్తవారింటికి సాగనంపుతూ, ఆ వియోగ క్లేశాన్ని ఎదుర్కోలేక ఆశ్రమవాసులు దుఃఖించడం సమస్త సాహిత్యంలోను గొప్ప కరుణార్ద్ర ఘట్టంగా పేర్కొంటారు. బడిపిల్లలకోసం ఏర్పాటైన ఆ వీడ్కోలు సమావేశాన్ని బట్టి నేనా ఘట్టాన్ని ఊహించుకోడం. సాధ్యమైంది. అయిదేళ్ళ తర్వాత బడితోను, అధ్యాపకులతోను కలిగిన ఎడబాటు విద్యార్థుల చేత వెక్కిళ్ళు పెట్టిస్తూ ఏడ్పించింది. ఉపాధ్యాయులచేత కన్నీళ్లు పెట్టించింది. అయ్యవార్లు అత్యంత ప్రేమాభిమానాలతో పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పించి వుండాలి. విద్యార్థులు ఎంతో భయభక్తులతో, శ్రద్ధాసక్తులతో చదువుల్ని ఒంటబట్టించుకుని వుండాలి. అలాగాకపోతే వాళ్ళమధ్య యిలాంటి గాఢమైన అనుబంధం నెలకొనే అవకాశం ఎక్కడిది? చాలని దానికి హెడ్మాస్టరుగారు మరొక విస్మయావహమైన వార్త నా చెవిలో వేశాడు. పాఠ్యపుస్తకాలు చేతికిచ్చి, ఇన్విజిలేటర్లని లేకుండా చేసినా నెమళ్ళదిన్నె విద్యార్థులు కాపీ కొట్టరట!

ఒకసారి అతికాయుల దేశానికిన్నీ మరొకసారి స్వల్పకాయుల దేశానికిన్నీ వెళ్ళి, వారికీ తనకూ మధ్య సమన్వయం కుదరక మునుపటికి గలివర్ అనే యాత్రికుడు పడిన యిబ్బందులన్నీ నాకు జ్ఞప్తికి వస్తున్నాయి. అవిధేయత, అలసత్వం, అవినీతి, స్వార్థప్రకోపం, చేటుబుద్ధి, చేతివాటుతనం - యిలా నే నెరిగిన లౌకిక న్యాయాలేవీ చెల్లుబడి లేనిచోట నేనూ ఒక గలివరులా గ్రుక్కిళ్ళు మ్రింగవలసివచ్చింది. ఆఖరుకు- మాటలకు చేతలకు బొత్తిగా పొంతన లేకపోవడమనే సామాన్య సామాజిక లక్షణం

ఆ వూరి సర్పంచిలోనైనా కనిపిస్తుందేమోనని ఆశించి, అందులోగూడా వీగిపోయాను. చదువుల్లోను, క్రీడల్లోను ఉన్నత శ్రేణిలో నిల్చిన వాళ్ళకు ప్రతి సంవత్సరమూ ప్రయిజులు కొనిపెట్టే వ్యక్తి ఆయనేనట. అంతేగాదు, ఆ పాఠశాలకు స్థలం ఉచితంగా యివ్వడంతోబాటు, కట్టడం నిర్మించి యిచ్చినవాడు గూడా ఆయనేనట. ఇంత చేసీ ఆయన తన పేరుతో ఆ హైస్కూలును పిలవడానికి సుతరామూ ఒప్పుకోలేదట.

ఎలా నమ్మగలను? నెమళ్ళదిన్నె అనేది స్వప్నప్రపంచం కాదు గదా! ఇక్కడికి నేనొచ్చినట్టుగా అనిపిస్తుండడం స్వప్నసంచారం కాదు గదా!

మరునాటి వుదయం నేను సెలవు పుచ్చుకోడం కోసం సర్పంచ్ మల్లేశప్ప గారి యింటికి వెళ్ళాను. వాలుకుర్చీలో పడుకుని పోతన్నగారి భాగవతం చదువు కుంటున్న మల్లేశప్పగారు "రఘుపతిగారూ! రండిరండి, మీ కోసమే చూస్తున్నా"నంటూ సాదరంగా పలకరించి, చిక్కటి మజ్జిగ యిప్పించి, ఉపాహారానికక్కడే ఉండి పొమ్మన్నారు. కొంతసేపు ఇష్టాగోష్ఠి కొనసాగిన తర్వాత నేనాయన్ను వినయంగా అర్థించాను.

"మల్లేశప్పగారూ! నాకేమిటో వెళ్ళాలని లేదండీ, ఇక్కడే వుండిపోవాలని వుంది. దయచేసి మీ రాజ్యంలో నాకు పౌరసత్వం యిప్పించరాదా?"

మల్లేశప్పగారు పెద్దవిగా చేసుకున్న కళ్ళతో కొద్దిక్షణాలు నావైపేచూస్తూ వుండిపోయి తర్వాత చటుక్కున ప్రారంభించారు: "ఏమండీ రఘుపతిగారూ! మీరేమో రచయితలైపోతిరి. మీకు రాముడుంటే చాలదు, రావణుడు గూడా వుండాలి. పాండవులుంటే చాలదు, కౌరవులు గూడా వుండాలి. పరస్పర విరుద్ధాంశాలు ఘర్షించకపోతే మీ పని సాగదు. ఆగిపోతుంది. మరైతే యిక్కడేమో తగదా పడి కోర్టుకెక్కేవాళ్ళు గూడా లేకపోయిరి? మీ వ్యాసంగం యిక్కడ కొనసాగేటట్టు తోచదే!"

గాయం కనిపించకుండా, వాత పైకి తేలకుండా కొరడా పెట్టి నాపైన దెబ్బ తీసేసినట్టయింది. నిండుగా ఒక నిమిషం గడిచిన తర్వాత గానీ తేరుకోలేక పోయాను.

"ఒక ధ్యేయంతో ఏర్పాటైన సంస్థల్ని అది కాస్తా నెరవేరిన తర్వాత రద్దు చేసేస్తారుగదండీ! ఏ కళకైనా పరమార్థం సమాజ శ్రేయస్సు. అది చేకూరి, ఇక తమ అవసరం సమాజానికి లేదనిపిస్తే రచయితలు తమతమ కొట్లు మూసివేయడానికి సిద్ధమేనని నేననుకుంటున్నాను" అన్నాను.

"భేష్ భేష్, భలే మంచిమాట సెలవిచ్చారు!" నిండుగుండెలు కదిలి పోయేట్టుగా నవ్వుతూ అన్నారు మల్లేశప్పగారు.టః-

♦ 'ఈనాడు' ఆదివారం అనుబంధం, 26.1.1992 ♦